18 మెట్లు.. 23 ఏళ్లు

శ్రీనగర్‌కాలనీ అయ్యప్ప ఆలయంలో ఆధ్యాత్మిక వేడుకలు

- నిరాటంకంగా కొనసాగుతున్న మండల పూజలు
- అష్టకలశాభిషేకం, లక్ష పుష్పార్చన
- శబరిమల తరహాలో తిరువాభరణం, అయ్యప్ప గజారోహణం



శ్రీనగర్‌కాలనీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్వామియే శరణమయ్యప్ప అంటే చాలు ఎంతటి ఆపదైనా ఇట్టే మాయమవుతుంది అన్నది భక్తుల విశ్వాసం. అందుకే అయ్యప్పను కొలిచేవారు కార్తీక మాసం వచ్చిందంటే చాలు దీక్ష తీసుకొని అత్యంత భక్తిశ్రద్ధలతో మండల కాలం పూజలు నిర్వహించి నెత్తిన ఇరుముడి కట్టుకొని శబరియాత్రకు బయలు దేరుతుంటారు. ఈ మండల కాలం ఓ విధంగా అయ్యప్ప దీక్షాపరులకు పండుగ కాలం అని చెప్పొచ్చు. ఇలాంటి వేడుకలను శబరిమల తరహాలో నిర్వహిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక ఉత్సవాలను నిర్వహిస్తున్న శ్రీనగర్‌కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అయ్యప్ప ఆలయం 23 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ప్రతీ మండల కాలంలో ప్రతీ రోజు విశేష పూజలతోపాటు అష్టకలశాభిషేకం, లక్ష పుష్పార్చన, గజారోహణం వంటి ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహిస్తోంది. ప్రతీ రోజు గణపతి హోమం, అభిషేకం, సాయంత్రం పడిపూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ప్రతీ రోజు అన్నదానం

అయ్యప్ప స్వామి ఆలయంలో నిత్యం వచ్చే అయ్యప్ప దీక్ష పరులతో పాటు భక్తులకు ఇక్కడ నిత్యం అన్నదానం, సాయంత్రం అల్పాహారం అందిస్తుంటారు. 1999లో సుమారు 30మందితో మొదలైన అన్నదానం అదే యేడాది 50 మంది వరకు భక్తులు వచ్చే వారు. తొలి యేడాది స్పందన బాగుండడంతో అన్నదానంను ప్రతి యేటా కొనసాగించాలని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ గురుస్వామి భావించారు. ఈ మేరకు 2000లో మండల పూజ ఉత్సవాల్లో అన్నదానం నిర్వహించేందుకు ఏర్పాట్లు జరిగాయి. వంద, రెండు వందల నుంచి వెయ్యి మందికి చేరారు. మాల వేసుకున్న ఉద్యోగులు, విద్యార్థులకు ఇక్కడి అన్నదానం వరంలా మారింది. అనతి కాలంలోనే ఈ కార్యక్రమానికి ప్రాచుర్యం కలిగింది. 2008 నుంచి ఆలయంలో సుమారు నాలుగు వేల మంది అయ్యప్పలు భిక్ష స్వీకరించేవారు. అంతేగాకుండా సాధారణ భక్తులు ఇక్కడ అన్నదానంను అయ్యప్పస్వామి ప్రసాదంగా స్వీకరిస్తుంటారు. ప్రతీ రోజు ఆరు క్వింటాళ్ల బియ్యం, క్వింటా పప్పు, క్వింటా కూరగాయలు వంటల్లో ఉపయోగిస్తున్నారు. ఒక కూర, పప్పు, సాంబరు, మజ్జిగ అందిస్తున్నారు. ఇక సాయంత్రం అయితే ఆకు మీద కనీసం మూడు రకాల అల్పాహారాలు వడ్డిస్తుంటారు. ఉదయం, సాయంత్రం కిచెన్‌లో సుమారు 15 మంది వంటవాళ్లు పనిచేస్తుండగా వడ్డించేందుకు సుమారు 20 మంది వరకు సేవలందిస్తుంటారు. ఇక ముడిసరుకుల కొనుగోలు, ఇతరత్రా కార్యక్రమాలను సేవా సమితి నిర్వాహకులు సమీక్షిస్తుంటారు. ప్రతీ రోజు వంటి మామిడి నుంచి కూరగాయలు తెప్పించడం దగ్గర నుంచి నాణ్యమైన సరుకుల కొనుగోలు వరకు వీరే పర్యవేక్షిస్తుంటారు.



మేళవిస్తున్న కేరళ సంప్రదాయం

ప్రస్తుతం ఆలయంలో మండల పూజలు వైభవంగా జరుగుతున్నాయి. తెలుగు, కేరళ సంప్రదాయాలను అనుసరించి ఇక్కడ పూజాధికాలు జరుగుతుంటాయి. మండల దీక్షలు మొదలైన 20 రోజులకు అష్టకలశాభిషేకం నిర్వహిస్తారు. ఈనెల 7న ఉదయం నుంచి 108 కలశాలకు వేద మంత్రాల మధ్య కలశ పూజలు నిర్వహించిన అనంతరం దీక్ష పరులు నెత్తిన కలశాలు పెట్టుకొని ప్రదక్షిణలు చేసి ఆ నీటితో అయ్యప్ప మూల విరాట్‌కు అభిషేకం చేస్తారు. కేరళ వాయిద్యాల మధ్య ఈ తంతు నిర్వహిస్తారు. మండల పూజ ముగిసే ముందర అయ్యప్పకు వివిధ రకాల లక్ష పుష్పాలు తీసుకువచ్చి పూజలు చేస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ పూజాధికాలు జరుగుతాయి.

ప్రతిష్ఠాత్మకం గజారోహణం..

ఆలయంలో అయ్యప్ప గజారోహణంను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 14న ఈ ఉత్సవం జరగనున్నది. శబరిమలలో ప్రతీ యేట మకరజ్యోతి రోజున అయ్యప్పకు పందల రాజ్యం నుంచి తిరువాభరణం తీసుకువచ్చి స్వామి వారికి అలంకరిస్తారు. ఇది అయ్యప్ప భక్తులకు పెద్ద వేడుక. ఇదే తరహాలో ఇక్కడ గజారోహణం రోజున అయ్యప్ప తిరువాభరణం తీసుకువచ్చారు. పెద్ద పెట్టెలో స్వామి వారి నగలను పెట్టి జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్.5లో పూజలు నిర్వహిస్తారు. అనంతరం పెద్ద వేడుకగా ఆధ్యాత్మిక నినాదాల మధ్య తిరువాభరణ ఊరేగింపు నిర్వహిస్తారు. శబరిమల తరహాలో ఇక్కడ కూడా ఆభరణాలను స్వామి వారికి అలంకరించే వరకు ఆకాశంలో గద్ద తిరుగుతుంటుంది. అయ్యప్ప ఆభరణాలు అలంకరించిన అనంతరం పడిపూజా మహోత్సవం నిర్వహిస్తారు. ఈ తంతు నిర్వహించేందుకు శబరిమల నుంచి ప్రత్యేకంగా తంత్రీలు వస్తారు. ఇదే రోజు సాయంత్రం కేరళ సంప్రదాయ నృత్యాలు, విన్యాసాల మధ్య అయ్యప్ప గజారోహణం చేస్తారు. అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని ఏనుగు అంబారిపై పెట్టి శ్రీనగర్‌కాలనీ, ఇందిరానగర్, కృష్ణానగర్, యూసుఫ్‌గూడ, ఎల్లారెడ్డిగూడ మీదుగా ఊరేగింపు నిర్వహిస్తారు.

ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నాం



మండల దీక్షలో ప్రత్యేక పూజలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, సంప్రదాయకంగా నిర్వహిస్తున్నాం. ఆధ్యాత్మిక భావనకు పెద్దపీట వేస్తూ అయ్యప్ప భజనలు, పడిపూజలు జరుపుతున్నాం. గజారోహణంలో సుమారు 15 వేలమంది భక్తులకు పైగా హాజరవుతారు. ఈ తంతు కోసం శబరి నుంచి ప్రత్యేకంగా తంత్రీలను రప్పిస్తాం. అయ్యప్పస్వామి ఆలయం అన్నదానంనుఅత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నాం. ఎంతోమంది దాతలు ఈ అన్నదానంకు సహకరిస్తున్నారు.

శ్రీనివాస్‌శర్మ, ఆలయ ఈవో

ఈసారి మరింత వైభవంగా ఉత్సవాలు



ఈ యేడాది అయ్యప్ప మండల పూజలు ఘనంగా జరుగుతున్నాయి. అష్టకలశాభిషేకం, గజారోహణం, లక్ష పుష్పార్చనను మరింత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. శ్రీనగర్‌కాలనీ అయ్యప్ప అన్నదానం అంటే నగరంతోపాటు చుట్టూ ఉన్న ప్రాంతాల వారికి కూడా తెలుసు. గజారోహణంకు వివిధ ప్రభుత్వ రంగాలకు చెందిన అధికారులు తోడ్పాటును అందిస్తున్నారు.

సిపిరి అర్జున్‌యాదవ్, ధర్మకర్తల మండలి చైర్మన్



ఇందిరాపార్కులోని మర్రి చెన్నారెడ్డి సమాధి వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న బీజేపీ జాతీయ మహిళా మోర్చా నాయకురాలు డాక్టర్ వీరపనేని పద్మ



రోహిత్‌కు శుభాకాంక్షలు చెబుతున్న విశాల్‌బాబు, తదితరులు

డీసీసీ అధ్యక్షుడిని కలిసిన యువజన నేతలు

ఖైరతాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన మోతె రోహిత్‌ను ఖైరతాబాద్‌కు చెందిన యువజన కాంగ్రెస్ నాయకులు మంగళవారం కలిశారు. ఖైరతాబాద్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి విశాల్‌బాబు నాయకత్వంలో రోహిత్‌ను కలిసి యువజన కాంగ్రెస్ బలోపేతంపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు బాలు, వినోద్, నాగరాజు, చిన్న, విశ్వనాథ్ పాల్గొన్నారు.

నిమ్స్ ఉద్యోగి వీల్‌చైర్లు అందజేత



దాత నుంచి వీల్‌చైర్లు స్వీకరించిన డైరెక్టర్ బీరప్ప

నిమ్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రోగుల సౌకర్యార్థం తమ సంస్థ ఉద్యోగి వీల్‌చైర్లు అందజేయడం అభినందనీయమని నిమ్స్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప కొనియాడారు. నిమ్స్ ఆస్పత్రి మైక్రో బయాలజీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎంఏ పాటిల్ తన తండ్రి అప్పారావు పాటిల్ జ్ఞాపకార్థంగా సమకూర్చిన ఐదు వీల్‌చైర్లను బీరప్పకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌ఓ సత్యగౌడ్, ఆర్‌ఎంఓ డాక్టర్ సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువకుడి అదృశ్యం



ఫైజుద్దీన్

బోరబండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని యువకుడు అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారా నగర్‌కు చెందిన సాహెరాబేగం, ఫరీదుద్దీన్ దంపతుల పెద్ద కుమారుడు ఫైజుద్దీన్(25)కు ఐదేళ్ల కిందట తలకు తీవ్రగాయం కావడంతో మతిస్థిమితం సరిగా ఉండడం లేదు. సోమవారం రాత్రి 8 గంటల సమయంలో తల్లి నుంచి రూ.10 తీసుకొని బిస్కెట్ ప్యాకెట్ తెచ్చుకున్నాడు. ఇంటి బయట కూర్చుని బిస్కెట్లు తిన్న ఫైజుద్దీన్ కొంత సమయం తర్వాత కనిపించలేదు. పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి సాబేరాబేగం ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రేమ పేరుతో దగ్గరై మోసం

బేగంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన వ్యక్తిపై సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఉప్పరపల్లికి చెందిన ఓ యువతి(26)కి సనత్‌నగర్ జెక్ కాలనీలోని వాసవి ఇంద్రప్రస్థ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న కృష్ణకాంత్(30)కు ఆరు నెలల క్రితం పరిచయమైంది. ప్రేమ పేరుతో వీరు తరచూ కలుసుకునే వారు. వివాహం చేసుకుందామని ఆ యువతిని నమ్మించాడు. పెళ్లికి పెద్దలు అంగీకరించారని అతడు చెప్పడంతో యువతి నమ్మింది. దీంతో ఇద్దరు తరచూ కలవడంతో పాటు శారీరకంగా దగ్గరయ్యారు. ఇటీవల యువతికి ముఖం చాటేయడంతో అతడిని నిలదీసింది. పెళ్లికి కుటుంబ సభ్యులు అంగీకరించడం లేదని అతడు చెప్పాడు. దీంతో ఆ యువతి మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి యత్నించడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్చారు. యువతి గత నెల 24వ తేదీన సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆ దిశగా దర్యాప్తు జరిపారు. యువతి ఫిర్యాదు మేరకు కృష్ణకాంత్‌ను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

వెండి ఆభరణాలు చోరీ

బంజారాహిల్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత వైద్యుడి ఇంట్లో వెండి ఆభరణాలు చోరీ అయ్యాయి. జూబ్లీహిల్స్‌లో నివాసముండే డాక్టర్ మోర్ల సురేష్‌రాయ్ ప్రభుత్వ విభాగం వైద్యుడిగా పనిచేసి రిటైర్ అయ్యారు. గత నెల 25న నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లికి వెళ్లిన ఆయన తిరిగి వచ్చి తిరుపతి వెళ్లారు. అనంతరం ఈనెల 1న ఇంటికి వచ్చి అల్మారాలో చూడగా 5 జతల వెండి పట్టీలు, 50 తులాల వెండి పురాతన కాయిన్ బాక్స్, జర్మన్ సిల్వర్ సెట్స్ కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోగొట్టుకున్న ల్యాప్‌టాప్ అందజేత

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనదారుడు పోగొట్టుకున్న ల్యాప్‌టాప్‌ను కేపీహెచ్‌బీ పోలీసులు రికవరీ చేసి బాధితుడికి మంగళవారం అందజేశారు. ఇటీవల ఓ ఉద్యోగి బైక్‌పై వెళ్తూ తన ల్యాప్‌టాప్ బ్యాగ్‌ను పోగొట్టుకున్నాడు. విషయాన్ని వెంటనే కేపీహెచ్‌బీ పోలీసులకు తెలిపాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ల్యాప్‌టాప్ బ్యాగ్‌ను ఆటోడ్రైవర్ తీసుకున్నట్టు గుర్తించారు. అతడి వద్ద ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకుని బాధితుడికి తిరిగి అప్పగించారు. పోయిన ల్యాప్‌టాప్‌ను రికవరీ చేయడంలో కృషి చేసిన కేపీహెచ్‌బీ పోలీసులను ఏసీపీ రవికిరణ్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

అంతర్గత రహదారుల అభివృద్ధికి కృషి



బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్, కమాండెంట్ మురళీకృష్ణ

యూసుఫ్‌గూడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బెటాలియన్‌లోని అంతర్గత రహదారుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్ అన్నారు. మంగళవారం హిల్ టాప్‌కు వెళ్లే బీటీ రహదారి పనులను కమాండెంట్ పి.మురళీకృష్ణతో కలిసి మంగళవారం ఆయన పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ నరేంద్ర సింగ్, రామకృష్ణ, అసిస్టెంట్ కమాండెంట్‌లు రాంబాబు, భాస్కర్, అప్పారావు, నర్సింహ, ఆర్‌ఐలు కృష్ణార్జునరావు, నాగేశ్వరరావు, రాజేష్, సాంబయ్య, రమేష్‌బాబు, ఆర్‌ఎస్‌ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ ఎల్లయ్యకు అంతర్జాతీయ హెల్త్‌కేర్ అవార్డు



తనకు వచ్చిన అవార్డులతో డాక్టర్ ఎల్లయ్య

బంజారాహిల్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైద్యనిపుణుడు, సాహితీవేత్త డాక్టర్ కావడి ఎల్లయ్యకు మలేషియాలో జరిగిన ఇంటర్నేషనల్ అవార్డ్స్ సమ్మిట్-2025లో గ్లోబల్ హెల్త్‌కేర్ అవార్డు లభించింది. 85 ఏళ్ల వయసులోనూ తక్కువ ఫీజుతో సేవలందిస్తూ పేదలకు ఉచిత చికిత్స అందిస్తున్న డాక్టర్ ఎల్లయ్య మూడు దశాబ్దాలకుపైగా ప్రభుత్వ వైద్య సేవల్లో పనిచేశారు. అవార్డు తీసుకొని నగరానికి వచ్చిన ఆయనను జూబ్లీహిల్స్‌లో పలువురు మంగళవారం సన్మానించారు. వైద్యం, సాహిత్యం, మానవత మూడు రంగాల్లోనూ సేవలందించిన డాక్టర్ ఎల్లయ్య జీవితం సమాజానికి ఆదర్శమని పలువురు అభినందించారు.

ఏబీవీపీ ఆలిండియా స్టేట్ యూనివర్సిటీస్ కో-కన్వీనర్‌గా సురేష్



కమల్ సురేష్

ఖైరతాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ ఆలిండియా స్టేట్ యూనివర్సిటీస్ కో-కన్వీనర్‌గా కమల్ సురేష్ నియమితులయ్యారు. ఉత్తరాఖండ్ డెహ్రాడూన్‌లో జరిగిన 71వ జాతీయ మహాసభల్లో ఏబీవీపీ జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ రఘురాజ్ కిషోర్ తివారి ఈ నియామకం చేశారు. గతంలో ఉస్మానియా యూనివర్సిటీ సైన్స్ కళాశాల అధ్యక్షుడిగానూ, సైఫాబాద్ జోనల్ ఇన్‌చార్జిగానూ పనిచేసిన కమల్ కిషోర్ తనకు జాతీయస్థాయి బాధ్యత ఇచ్చిన పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ఏబీవీపీని మరింత పటిష్టపరిచేలా తన శక్తి మేరకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూడాలి

అమీర్‌పేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూడాలని కోరుతూ మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు మంగళవారం ఎస్‌ఆర్‌నగర్ ఏసీపీ రాఘవేంద్రరావుకు వినతిపత్రం అందజేశారు. నూతన ధర్మకర్తలు ఆలయ అభివృద్ధికి పాటు పడాల్సింది పోయి గతంలో తమ పార్టీ మాజీ మంత్రి, ప్రస్తుత సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ చేసిన అభివృద్ధిని ఆనవాళ్లు లేకుండా చేయాలని ప్రయత్నిస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్ యాదవ్, కూతురు నర్సింహ, వనం శ్రీనివాస్, కట్టా బలరాం, లక్ష్మి, గిరియాదవ్, రాణికౌర్, ప్రభుగౌడ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఆటంకాలు కలిగిస్తే కఠిన చర్యలు

బంజారాహిల్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్‌కు ఆటంకాలు కలిగించేలా వ్యవహరిస్తే కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని ఆటోడ్రైవర్లను ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే హెచ్చరించారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులో మంగళవారం ఆటోడ్రైవర్లకు ఏసీపీ కట్టా హరిప్రసాద్‌తో కలిసి ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇదిలా ఉండగా, తమకు ఆటోస్టాండ్ లేదని ఆటోడ్రైవర్లు డీసీపీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రోడ్డు నెంబర్.36కు వెళ్లే దారిలో ఉన్న ఖాళీ స్థలాన్ని ఆటో స్టాండ్ కింద ఉపయోగించుకోవాలని సూచించారు.

మహిళల అభ్యున్నతికి ఇందిరా మహిళా శక్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవీన్ యాదవ్

యూసుఫ్‌గూడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసి, మహిళా సాధికారత సాధించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్ అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కవిత మహిళా నేతలతో యూసుఫ్‌గూడలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి పథకం మహిళలను వ్యాపార రంగాల్లో భాగస్వామ్యం చేసిందన్నారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకురాలు జ్యోతి పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే

జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖాడేని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. కమిషనర్ కార్యాలయంలో అభినందనలు తెలిపారు.

దుర్గాభవానీనగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ, సోషల్ వెల్ఫేర్ అధికారులు, కాంగ్రెస్ నాయకుడు నర్సింగరావు

బంజారాహిల్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్.5 దుర్గాభవానీనగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం మార్గం సుగమం అవుతోంది. బస్తీలో ఉండే గిరిజనులు ఎప్పటి నుంచో సొంత ఇళ్లు కావాలని కోరుతున్నారు. 25 సంవత్సరాలుగా గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ప్రయత్నాలు ఆరంభించింది. ఎమ్మెల్యే దానం నాగేందర్ గిరిజనులు ఉంటున్న గురుబ్రహ్మనగర్, దుర్గాభవానీనగర్‌లో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురుబ్రహ్మనగర్‌లో అధికారులు పరిశీలన పూర్తి చేశారు. త్వరలో నిర్మాణాలు చేపట్టేందుకు నమూనాలు సిద్ధం చేస్తున్నారు. దుర్గాభవానీనగర్‌లో కూడా మంగళవారం రెవెన్యూ, సోషల్ వెల్ఫేర్ అధికారులు, ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి నర్సింగరావు తదితరులు బస్తీలో పర్యటించారు. లబ్ధిదారుల పరిశీలన చేపట్టారు. బస్తీలో సుమారు 150 మంది లబ్ధిదారులు ఉండే అవకాశం ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఈ సర్వేలో బస్తీ అధ్యక్షుడు గౌడనాయక్, కార్యదర్శి జానినాయక్ తదితరులు పాల్గొన్నారు.

బలహీనవర్గాల కాలనీలో నీటి నాణ్యత పరీక్షలు



నీటి నాణ్యతను పరిశీలిస్తున్న జలమండలి సిబ్బంది

బోరబండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బోరబండ డివిజన్ బలహీనవర్గాల కాలనీ బస్తీల్లో జలమండలి సిబ్బంది మంగళవారం నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించారు. స్థానిక బ్రాహ్మణవాడి, పెద్దమ్మగుడి నగర్ బస్తీల్లో కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని సీపీఎం నాయకులు ప్రజావాణి కార్యక్రమంలో జలమండలి జీఎం ప్రభాకర్ రావుకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన జీఎం కలుషిత జలాలు సరఫరా అవుతున్న బస్తీలకు సిబ్బందిని పంపిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు జలమండలి ఎస్సార్ హిల్స్ విభాగం సిబ్బంది మంగళవారం ఆయా బస్తీల్లో పర్యటించి నీటి నాణ్యతను పరిశీలించారు. నీటి సరఫరా ప్రారంభమైన కొంతసేపటి వరకు దుర్వాసనతో కూడిన నీళ్లు వస్తున్నాయని బస్తీల ప్రజలు తెలిపారు. కలుషిత జలాలు సరఫరా కాకుండా చర్యలు చేపడతామని సిబ్బంది వెల్లడించారు. తమ ఫిర్యాదు పై స్పందించి సిబ్బందిని పంపించిన జలమండలి జీఎంకు సీపీఎం జూబ్లీహిల్స్ జోన్ కమిటీ నాయకుడు టి.సాయిశేషగిరిరావు కృతజ్ఞతలు తెలిపారు.

గోమాతలను విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలి

కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎల్లమ్మ చెరువు కేంద్రంగా గోమాతలను విక్రయిస్తున్నారని, గోవులను విక్రయించే ముఠాపై అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు డిమాండ్ చేశారు. గంగిరెద్దుల ముసుగులో గోవులను కబేళాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం కూకట్‌పల్లి పీఎస్‌లో ఎస్‌హెచ్‌ఓ సుబ్బారావుకు ఫిర్యాదు పత్రం అందజేశారు.

మద్యం దుకాణం మూసివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదర్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ కాలనీ ప్రధాన రోడ్‌లోని మద్యం షాపును మంగళవారం జీహెచ్‌ఎంసీ అధికారులు సీజ్ చేశారు. స్థానికులు, సాయిబాబా దేవాలయానికి వచ్చే భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని భాగ్యనగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు కొన్ని రోజులుగా చేస్తున్న పోరాటానికి ప్రతిఫలం లభించింది. ఈ విషయంపై "ఇళ్ల మధ్య వైన్‌షాపుతో అవస్థలు" అనే శీర్షికన ఆంధ్రజ్యోతి పలుమార్లు ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. స్పందించిన జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అనధికార సెల్లార్‌లో నడుస్తున్న షాపును మంగళవారం సీజ్ చేశారు. అనంతరం మేడ్చల్ ఎక్సైజ్ అధికారులు షాపును పరిశీలించి లైసెన్స్ పొందిన వారు దాన్ని మరోచోటికి మార్చుకోవాల్సిందిగా సూచించారు. మద్యం షాప్ ఏర్పాటు చేయకుండా సీజ్ చేయడంపై భాగ్యనగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



సీజ్ చేసిన మద్యం దుకాణం



పికెట్‌లోని కంటోన్మెంట్ పార్కు

పార్కు సందర్శనకు ఫీజు వసూలు చేయాలని నిర్ణయం

సికింద్రాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని జూబ్లీ బస్‌స్టేషన్ (పికెట్) సమీపంలోని కంటోన్మెంట్ పార్కుకు వచ్చే సందర్శకుల నుంచి నామమాత్ర రుసుం వసూలు చేయాలని కంటోన్మెంట్ బోర్డు యంత్రాంగం నిర్ణయించింది. పార్కును సందర్శించే వారి నుంచి ఐదు రూపాయలు, ప్రతి రోజూ వాకింగ్, యోగా చేసేవారి నుంచి నెలకు రూ.100 వసూలు చేయాలని నిర్ణయించింది. పార్కు నిర్వహణ మరింత సాఫీగా, సమర్థవంతంగా జరగడానికి, ప్రవేశంపై కొంత కట్టడి చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. మరి కొద్ది రోజుల్లోనే రుసుం వసూలును అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి రోజూ పికెట్, అన్నానగర్, బాలంరాయి, కళాసిగూడ, మారేడుపల్లి తదితర ప్రాంతాల నుంచి వాకర్స్, లాఫింగ్ క్లబ్ సభ్యులు ఈ పార్కును సందర్శిస్తుంటారు.



తహసీల్దార్ అసద్ ఉల్లాఖాన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న జైభీమ్ మాల మహాసంఘం ప్రతినిధులు

అనధికారికంగా వేసిన బోర్‌ను సీజ్ చేయండి

అడ్డగుట్ట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అడ్డగుట్ట బస్టాపు సమీపంలో ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీ నిర్మించే ప్రైవేట్ స్థలంలో అనధికారికంగా వేసిన బోర్‌ను వెంటనే సీజ్ చేయాలని లేదంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని జైభీమ్ మాల మహాసంఘం ముఖ్య సలహాదారుడు నక్కా మధు, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంజిత్ కుమార్, సంఘం ప్రతినిధులు మంగళవారం మారేడుపల్లి తహసీల్దార్ అసద్ ఉల్లాఖాన్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అడ్డగుట్ట తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వీరు మాట్లాడుతూ అక్రమంగా బోర్ వేస్తున్నారని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని, నేరుగా తహసీల్దార్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే కూడా పట్టించుకోకపోతే ఎలా అన్నారు. అనుమతి లేకుండా అరున్నర ఇంచుల బోర్ వేసుకునేందుకు పర్మిషన్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు ఆర్.మల్లేష్, అమర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కేపి రమాదేవి, పి. జయకుమార్, నేతల రమేష్, పద్మ, పుష్ప, చంద్రశేఖర్, పురుషోత్తం, మహేందర్, సత్యనారాయణ, నవీన్, రాంచందర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జీవి.బాల్‌రాజ్

సర్వత్రా హర్షం

తిరుమలగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం, పరిశుభ్రతకు నోచుకోని బొల్లారం చింతల్ బజార్ బస్తీని శుభ్రం చేయడం అభినందనీయమని సికింద్రాబాద్ గణేష్ టెంపుల్ మాజీ ధర్మకర్త, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జీ.వీ.బాల్‌రాజ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల అభ్యర్థన మేరకు బొల్లారం వార్డు 8 శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ అమిత్ పలు ప్రాంతాలను శుభ్రం చేయించారు. శుభ్రం చేస్తున్న కంటోన్మెంట్ సిబ్బంది పనితీరును జీ.వీ.బాల్‌రాజ్ తన బృందంతో పరిశీలించారు. ఎన్నో నెలల నుంచి కంటోన్మెంట్ అధికారులకు ఈ ప్రాంతాలను శుభ్రం చేయాలని విన్నవించడంతో శానిటరీ సిబ్బంది శుభ్రం చేయడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా అధికారులకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.



పూజ చేస్తున్న అయ్యప్ప స్వాములు

అయ్యప్ప స్వాములకు అన్నప్రసాదం

సికింద్రాబాద్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వాములకు అన్నప్రసాద సేవ చేయడం గొప్ప విషయమని బీఆర్ఎస్ సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ అన్నారు. సికింద్రాబాద్ పార్క్‌లేన్‌లోని ముచ్చర్ల మెన్షన్‌లో నాలుగు సంవత్సరాలుగా బోయినపల్లి మార్కెట్ ఛైర్మన్ రాగీరు ఆనంద్‌బాబుగౌడ్, ముచ్చర్ల కృష్ణ, శివనారాయణగుప్తా, శ్రీనివాస్, వినయ్‌ల బృందం ప్రతిరోజూ వెయ్యి మందికిపైగా స్వాములకు అన్నప్రసాద సేవ చేయడం పట్ల ఆయన అభినందించారు. మంగళవారం అయ్యప్ప పూజ చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాంగోపాల్‌పేట్ మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణ, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సెల్లార్ నిర్మాణంలో ప్రమాదం.. కూలీ మృతి



ఘటన జరిగిన సెల్లార్ ప్రదేశం

అడ్డగుట్ట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సెల్లార్ నిర్మాణ సమయంలో జరిగిన ప్రమాదంలో ఓ కూలి మృతి చెందిన ఘటన మహంకాళి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ పాన్‌బజారులోని ఓ వ్యక్తి భవన నిర్మాణం కోసం తవ్వకాలు చేపట్టారు. దీని నిమిత్తం ముషీరాబాద్ జెమిని కాలనీకి చెందిన పురుషోత్తం అనే వ్యక్తి కూలీగా పనిచేస్తున్నాడు. మంగళవారం నిర్మాణ సమయంలో జేసీబీ ఆపరేటర్ నిర్లక్ష్యంగా నడుపడంతో జేసీబీ పురుషోత్తంకు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు.. పురుషోత్తం మృతికి కారకుడైన అష్లల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. జీహెచ్ఎంసీ నుంచి ఎటువంటి అనుమతి తీసుకోకుండానే నిర్మాణాలు చేపట్టాడని విచారణలో వెల్లడైంది. కేసు దర్యాప్తులో ఉంది.

అక్రమ కట్టడం కూల్చివేత



అక్రమ కట్టడాన్ని కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

బౌద్ధనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఓ అక్రమ భవనాన్ని మంగళవారం సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు కూల్చివేశారు. చిలకలగూడలో ఓ వ్యక్తి రోడ్డు ఆక్రమించి భవనాన్ని నిర్మిస్తున్నాడని స్థానికులు ఇటీవల టౌన్ ప్లానింగ్ విభాగంలో ఫిర్యాదు చేశారు. విచారణలో అతడు భవన నిర్మాణం చేపడుతున్నట్లు గుర్తించారు. ఏసీపీ పావని ఆధ్వర్యంలో సెక్షన్ ఆఫీసర్ నర్సింగ్‌రావు సమక్షంలో సిబ్బంది అక్రమ భవనాన్ని కూల్చివేశారు.

తాగునీటి సమస్యకు సత్వర పరిష్కారం

తలసాని శ్రీనివాస్ యాదవ్



తాగునీటి సమస్యను అధికారులకు వివరిస్తున్న తలసాని శ్రీనివాస్ యాదవ్

పద్మారావునగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పది రోజుల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని మాజీమంత్రి, సనత్‌నగర్ శాసనసభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ నిచ్చారు. మంగళవారం ఆయన బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని బండమైసమ్మనగర్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయంలో వివిధ శాఖల అధికారులతో కలసి పర్యటించి, స్థానిక సమస్యలను తెలుసుకొన్నారు. ప్రధానంగా సీ బ్లాక్‌లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నదని, లోప్రెజర్‌తో నీటి సరఫరా అవుతోందని స్థానికులు తెలిపారు. మొత్తం 266 కుటుంబాలకు గాను ఒక్క సంపు మాత్రమే ఉందని, సమస్య పరిష్కారానికి అదనంగా మరో సంప్ నిర్మించాలని ఆయనకు విన్నవించారు. స్పందించిన తలసాని నీటి సరఫరాలో జరుగుతున్న ఇబ్బందులను అధిగమించటానికి పది రోజుల్లోగా శాశ్వత పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని జలమండలి జీఎం వినోద్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన సౌకర్యాలు లేని ఇండ్లలో నివసిస్తూ వారు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించినట్లు వివరించారు. అంతేకాక ఇండ్ల నిర్వహణ భారం పడొద్దనే ఆలోచనతోనే మడిగెలను నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఇక్కడ నివసించే వారు అభివృద్ధి కమిటీలను ఏర్పాటుచేసుకోవాలని, తద్వారా త్వరితగతిన సమస్యలను పరిష్కరించుకొనే అవకాశం ఉంటుందని చెప్పారు. షాపుల ద్వారా వచ్చే ఆదాయాన్ని కమిటీ ఖాతాలో జమ చేసి, నిర్వహణకు వినియోగించుకోవాలని అన్నారు. మిగిలిన ఇండ్లను అర్హులైన లబ్దిదారులకు పంపిణీ చేయాలని కోరగా ,ఈ విషయమై ఇప్పటికే కలెక్టరుకు లేఖ రాసిన విషయాన్ని తెలిపారు. కార్పొరేటర్ కుర్మ హేమలత,డీసి డాకు నాయక్, ఈఈ సుబ్రమణ్యం, జలమండలి జీఎం వినోద్, హౌసింగ్ డీఈ సంధ్య,డబుల్ బెడ్ రూమ్ నివాసితులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నూతన మద్యం దుకాణం సీజ్

● కాలనీవాసుల అభ్యంతరం ● ట్రేడ్ లైసెన్స్‌లు లేని కారణం



డైమండ్ పాయింట్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని సీజ్ చేసిన కంటోన్మెంట్ బోర్డు అధికారులు

బోయినపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జనవాసాల మధ్య మద్యం దుకాణాలు ఏర్పాటు చేయకుండా చర్యలు చేపట్టాలని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద కోరారు. ఈ విషయమై బోర్డు సీఈఓ అరవింద్ ద్వివేదికు వినతిప్రతం అందజేసిన కొద్ది గంటల్లోనే నూతనంగా ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణాన్ని సీజ్ చేసినట్లు కంటోన్మెంట్ బోర్డు అధికారి దేవేందర్ తెలిపారు. ఇటీవల లిక్కర్ షాపుల టెండర్లలో షాపులు దక్కించుకున్న వారు కంటోన్మెంట్ బోర్డు ఆరవ వార్డులోని డైమండ్ పాయింట్, విన్నకమేళా, సెంటర్ పాయింట్ ప్రాంతాల్లో షాపులను ఏర్పాటు చేస్తుండగా కాలనీ, బస్తీవాసులు వ్యతిరేకించారు. కాలనీల మధ్యలో దుకాణం ఏర్పాటు చేస్తే స్థానిక మహిళలు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటారని వారు సీఈఓ దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి తోడు ఈ దుకాణంకు సమీపంలో పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. అలాగే సెంటర్ పాయింట్ ప్రాంతాల్లోని మద్యంషాపు ఏర్పాటును కూడా ప్రజలు వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. కాగా కాలనీల వాసులతో పాటు సివిలియన్ నామినేటెడ్ మెంబర్ నర్మద అభ్యర్థన మేరకు, కంటోన్మెంట్ ట్రేడ్ లైసెన్స్‌లు కూడా లేకుండా మద్యం దుకాణాలు తెరవడం పైన ఫిర్యాదులు అందటంతో బోర్డు అధికారులు డైమండ్ పాయింట్ కిరణ్ ఎన్‌క్లేవ్ వద్ద ఏర్పాటు చేస్తున్న మద్యం షాపును సీజ్ చేసినట్లు బోర్డు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

తెన్నేటి సుధాదేవి సాహితీ సేవలు విలువైనవి

చిక్కడపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత్రి డా. తెన్నేటి సుధాదేవి సాహితీ, సాంస్కృతికరంగ సేవలు విలువైనవని యువకళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ అన్నారు. స్వరమాధురి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో సినీ సంగీత విభావరి సంస్థ అధ్యక్షురాలు, ప్రముఖ గాయని సాయిపావని ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సుధాదేవికి ఘనంగా నివాళులర్పించారు. ప్రముఖ నటుడు నాగేందర్ తదితరులు పాల్గొన్నారు. సాయిపావని, వెంకీ, అర్చన, రీట, రాము, ప్రసాద్, శిరీష, చిరంజీవి, శ్రీరామమూర్తి, వాసు, రమణ, వెంకటలక్ష్మి రామ్, ద్రోణంరాజు సిరి గీతాలను మధురంగా ఆలపించారు.

ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కవాడిగూడ. డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని గాంధీనగర్ సీఐ బోస్ కిరణ్ సూచించారు. మంగళవారం కవాడిగూడ ఎస్‌బీఐకాలనీలో గల గౌతమ్ మోడల్ స్కూల్‌లో ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాల పట్ల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోసాలు, నేరాలపై రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. సీఐ మాట్లాడుతూ మొబైల్ ఫోన్లకువచ్చే అపరిచిత మెసేజ్‌లకు స్పందించొద్దన్నారు. ఏపీకే ఫైల్స్ వస్తే ఓపెన్ చేయొద్దన్నారు. కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఆర్. వెంకటేశ్వర్లు, సెక్టార్ ఎస్ఐ నర్సింహులు, స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యా అవకాశాలపై అవగాహన



విద్యార్థులు అవగాహన కల్పిస్తున్న విండ్సర్ ప్రొఫెసర్

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీలోని హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ (హెచ్‌సీడీసీ), జీఈసీఎఫ్ సంయుక్తంగా కెనడా యూనివర్సిటీ ఆఫ్ విండ్సర్‌లో ఉన్నత విద్యా అవకాశాలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం సీఎఫ్ఆర్‌డీ భవనంలోని ఈ-క్లాస్‌రూమ్‌లో నిర్వహించారు. విద్యార్థులకు విదేశీ విద్య, ఇంటర్న్‌షిప్ అవకాశాలపై అవగాహన కల్పించడమే లక్ష్యమని హెచ్‌సీడీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ విజ యా చరణ్, కోఆర్డినేటర్ డా.సుర్యవల్లి తెలిపారు. విండ్సర్ విశ్వవిద్యాలయానికి చెందిన డా.క్రిస్ బుష్ హై-డిమాండ్ కోర్సులు, రీసెర్చ్ సదుపాయాలు, స్కాలర్‌షిప్‌లు, అడ్మిషన్ ప్రక్రియపై విద్యార్థులకు సూచనలు ఇచ్చారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న వల్లభనేని ప్రసాద్

రాంనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ డెఫ్ రాష్ట్ర కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, కో-కన్వీనర్ కాటంనేని వెంకటేష్ డిమాండ్ చేశారు. బాగ్‌లింగంపల్లిలోని కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడారు. దివ్యాంగుల చట్టాన్ని అన్ని శాఖల్లో అమలు చేయాలన్నారు. దివ్యాంగులకు ఇచ్చే పింఛన్‌ను రూ. 6 వేలలకు పెంచాలని, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ఇందిరమ్మ ఇళ్ల పథకంలో దివ్యాంగులకు 5 శాతం కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు.

ప్రేమ పేరుతో దగ్గరై మోసం

బేగంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో యువతిని మోసం చేసిన వ్యక్తిపై సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఉప్పరపల్లికి చెందిన ఓ యువతి(26)కి సనత్‌నగర్ జెక్ కాలనీలోని వాసవి ఇంద్రప్రస్థ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న కృష్ణకాంత్(30)కు ఆరు నెలల క్రితం పరిచయమైంది. ప్రేమ పేరుతో వీరు తరచూ కలుసుకునేవారు. వివాహం చేసుకుందామని ఆ యువతిని నమ్మించాడు. పెళ్లికి పెద్దలు అంగీకరించారని అతడు చెప్పడంతో యువతి నమ్మింది. దీంతో ఇద్దరు తరచూ కలవడంతో పాటు శారీరకంగా దగ్గరయ్యారు. ఇటీవల యువతికి ముఖం చాటేయడంతో అతడిని నిలదీసింది. పెళ్లికి కుటుంబ సభ్యులు అంగీకరించడం లేదని అతడు చెప్పాడు. దీంతో ఆ యువతి మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి యత్నించడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్చారు. యువతి గత నెల 24వ తేదీన సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆ దిశగా దర్యాప్తు జరిపారు. యువతి ఫిర్యాదు మేరకు కృష్ణకాంత్‌ను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



బాక్స్ డ్రైనేజీ కోసం స్థలపరిశీలన చేస్తున్న కార్పొరేటర్, అధికారులు

బాక్స్ డ్రైనేజీ కోసం స్థల పరిశీలన

మల్కాజిగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని ఆర్‌కేనగర్ ప్రధాన రహదారిపై వరదనీరు మళ్లించేందుకు గాను ఏర్పాటుచేయాల్సిన బాక్స్ డ్రైనేజీ కోసం మంగళవారం కార్పొరేటర్ ఉరపల్లి శ్రవణ్ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ప్రతిసారి వర్షం వచ్చినప్పుడల్లా ఆర్‌కేనగర్ ప్రధాన రహదారి (బందరు పోచమ్మ ఆలయం) ఎదుట వరదనీరు నిలిచి ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు వ్యాపారులకు, పాదచారులకు ఇబ్బందులు తలెత్తుతున్నా యి. ఈ సమస్య పరిష్కారానికి గాను అక్కడ బాక్స్ డ్రైనేజీ కోసం వరదనీటిని నాలాలోకి మళ్లించేందుకు కార్యాచరణ రూపొందించారు. ఇందుకుగాను రూ. 50 లక్షల నిధులు సైతం మంజూరు చేశారు. దీనికి తోడు ఆర్‌కేనగర్ రైల్వే బ్రిడ్జి కింద సైతం ప్రతిసారి రోడ్డుపై పడ్డ వర్షపు నీరంతా బ్రిడ్జి కిందచేరి నిల్వ ఉం టుంది. ఈ సమస్య సైతం చాలా కాలంగా ఉంది. ఈ రెండు సమస్యలు పరిష్కారానికి గాను రైల్వే బ్రిడ్జి కింద పైప్‌లైన్‌తో పాటు ఆర్‌కేనగర్ ప్రధాన రహదారి వద్ద బాక్స్ డ్రైనేజీ నిర్మాణం కోసం మంగళవారం కార్పొరేటర్ ఉరపల్లి శ్రవణ్ జీహెచ్ఎంసీ అధికారులు ఈఈ రాయగిరి లక్ష్మణ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహ, ఏఈ నవీన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, నందు శ్రీనివాస్ పరిశీలించారు.

విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

కవాడిగూడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ఎస్‌వీ ఫౌండేషన్ చైర్మన్ పోచంపల్లి సుధీర్‌రెడ్డి, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. మంగళవారం ఏవీ కళాశాలలో ఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. పోటీల్లో ఓయూ పరిధిలోని 40 కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు పోటీలు జరగనున్నాయి. కార్యక్రమంలో ఏవీ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ రమావత్ ప్రకాష్, చీఫ్ ప్యాట్రన్ కరస్పాండెంట్ డాక్టర్ కె గౌతమి, డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ఐసీటీ ఓయూ సెక్రటరీ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్, ఏవీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజలింగం, పీజీ డైరెక్టర్ డాక్టర్ కె. భగవంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



బస్తీ సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

సమస్యల పరిష్కారమే ధ్యేయం

మారేడుపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన బస్తీల సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో బస్తీల పర్యటన చేపట్టినట్లు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్ తెలిపారు. మంగళవారం కంటోన్మెంట్ బోర్డు ఐదో వార్డు పరిధిలోని మహాత్మగాంధీనగర్‌లో పర్యటించి స్థానికులకు ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే ఆయన అధికారులకు స్థానికులు సూచించిన సమస్యల పరిష్కారంపై సత్వరమే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీ పర్యటనలో తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను గుర్తించి పరిష్కరించడానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు నంకి రవీందర్, పెద్దాల నరసింహ యాదవ్, సంతోష్, తేలుకుంట సతీస్, సాయి, బిక్షపతి, విష్ణు, బస్తీ పెద్దలు మల్లప్ప, గంటా రాజు, సత్యనారాయణ ఉన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

మారేడుపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : బలంరాయికి చెందిన నివేదితరెడ్డి అనారోగ్యానికి గురై నిమ్స్ ఆస్పత్రిలో చేరింది. ఆమె ఆస్పత్రి చికిత్స ఖర్చుల నిమిత్తం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను కలువగా, స్పందించిన ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి చికిత్స కోసం నిధులను మంజూరు చేయించారు. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.2 లక్షల విలువ చేసే ఎల్‌ఓసీ పత్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితురాలికి ఆయన అందజేశారు.

ప్రేమసాగర్‌కు ఓయూ డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ ఫర్ ఉమెన్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న జక్కులి ప్రేమసాగర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రధానం చేసింది. 'వైట్ ఎన్విరాన్‌మెంట్స్‌లో ఆబ్జెక్ట్ డిటెక్షన్, ప్రెషర్ ప్రెడిక్షన్' అంశంపై జియోస్పేషల్ డేటా ఆధారంగా డీప్ లెర్నింగ్ మోడళ్లతో ఆయన పరిశోధన సాగింది. యూసీఈ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డా. పి.వి.సుధా పర్యవేక్షణలో పరిశోధనను పూర్తి చేశారు. ఈ పరిశోధన సర్వైలెన్స్, స్వయం చలిత వాహనాలు, పర్యావరణ మానిటరింగ్ వంటి రంగాల్లో కచ్చితత్వం, సామర్థ్యం పెంపునకు ఉపయోగపడనుందని నిపుణులు తెలిపారు. ప్రేమసాగర్ సాధించిన ఈ విజయంపై కళాశాల ప్రిన్సిపాల్ డా.వై.మాధవి, మేనేజ్‌మెంట్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.



పారిశుధ్య కార్మికులను సత్కరించిన జంపన

పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివి: జంపన

సికింద్రాబాద్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివని సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అన్నారు. కంటోన్మెంట్‌లోని ప్రధాన, అంతర్గత రోడ్లపై నిత్యం విధులు నిర్వహిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్న దఫేదార్ రామకృష్ణ తదితర పారిశుధ్య సిబ్బందిని మంగళవారం ఆయన మాస్కులు, పండ్లు, బిస్కెట్లతో సత్కరించారు. దుర్గయ్య, ప్రేమ్‌ముదిరాజ్, సాయిబాబాయాదవ్, కరణ్‌సింగ్, బండి శ్రీను, యాదగిరి, కృష్ణ సురేష్, సత్యనారాయణ, రవీంద్ర కిరణ్, శివకృష్ణ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి చర్యలు



ఆలయ చైర్మన్ జానకి సుధాకర్‌కు వెండిని అందజేస్తున్న ధర్మకర్త హరీష్

చిక్కడపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చైర్మన్ జానకి సుధాకర్ తెలిపారు. ఆలయ ధర్మకర్త హరీష్, కుటుంబసభ్యులు ఆలయ గర్భగుడిలో పంచలోహాలతో ఏర్పాటు చేయనున్న సుందరకాండ చిత్రాలతో కూడిన తాపడం కోసం మంగళవారం తమవంతుగా కిలో వెండిని చైర్మన్ సుధాకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మాచర్ల దేవనాథం, సీనియర్ అర్చకుడు కందాళ వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులును కలిసి నిధులు విడుదల చేయాలని కోరుతున్న కార్పొరేటర్ సామల హేమ

అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయండి

● కార్పొరేటర్ సామల హేమ

బౌద్ధనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని స్థానిక కార్పొరేటర్ సామల హేమ సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులును కోరారు. మంగళవారం డిప్యూటీ కమిషనర్‌ను కలిసి అభివృద్ధి, పెండింగ్ పనులపై ఆమె చర్చించారు. అనంతరం చిలకలగూడ మున్సిపల్ పార్కును పరిశీలించి పార్కులో నెలకొన్న సమస్యలపై చర్చించారు. పార్కులో మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ కౌశిక్, నాయకులు కరాటే రాజు, నవీన్‌చారి, రవి పాల్గొన్నారు.

1/70 చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలి

● బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ, గిరిజనుల భూములకు 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మనబోయిన సైదులు యాదవ్ డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మంగళవారం ఆదివాసీ, గిరిజన భూముల రక్షణకు సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1/70 చట్టం అమలు చేయడంలో కేంద్రం తీవ్ర జాప్యం చేస్తోంద ని విమర్శించారు. అటవీ సంపదను కార్పొరేట్ వ్యవస్థలకు అప్పగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. దోపిడీ, అత్యాచారాలు, అన్యాయాలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వి ద్యార్థి నాయకులు పాలడుగు శ్రీను, ఆజాద్, ఆసిఫ్, నవీన్, శ్రీధర్ యాదవ్, శ్రవణ్, లక్ష్మణ్, కోలా శేఖర్, అచ్యుత్, ప్రసన్న, సుభాష్, వినయ్, భరత్, మనోజ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



సంతకాల సేకరణలో పాల్గొన్న బీసీఎస్ఎఫ్ నాయకులు